ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి మనోహర్ రాక

ఏలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఉదయం 11 గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఉంగుటూరుకు చేరుకుంటారు. స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం 2 గంటలకు ఉంగుటూరు నుంచి బయల్దేరి 2.30 గంటలకు ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. మూడు గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లో జరిగే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొని సాయంత్రం 5 గంటలకు విజయవాడకు బయల్దేరి వెళతారు.

నేటి నుంచి టెన్త్, దూరవిద్య ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి ఈ నెల 28 వరకు జరిగే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 7,707 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారని, మొత్తం 40 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 24 వరకు 11 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. దూరవిద్య టెన్త్ పరీక్షలకు 488 మంది, ఇంటర్ పరీక్షలకు 516 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయని, ఫర్నీచర్, తాగునీటి వసతి కల్పించామన్నారు. పరీక్షలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఫోన్ నంబరు 84669 74001తో ఏర్పాటు చేశామని వివరించారు.



రూ.4900 కోట్లు

- డీసీసీబీ రుణ లక్ష్యం ఖరారు
- 5.9 లక్షల మంది పైబడి రైతులకు రుణం
- డిపాజిట్ల పెంపు లక్ష్యం రూ.100 కోట్ల పైబడే

అత్తింటి వేధింపులకు.. వివాహిత బలి

■ లోపలి పేజీలో..

రుణం మాకే ఇప్పించండి!

- ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు జోరుగా పైరవీలు
- ఇదే అదనుగా కొందరు కమీషన్ల వసూలు

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ఎస్సీ సామాజిక వర్గంలో యువత మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ యూనిట్లను మంజూరు చేసింది. మొత్తం మూడు రకాల స్వయం ఉపాధి యూనిట్లు, వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా సబ్సిడీ ప్రకటించింది. ఈ క్రమంలో జిల్లాలో స్వయం ఉపాధి రుణ యూనిట్లకు పైరవీలు మొదలయ్యాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లల్లో ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా మూసేసి రుణం అనేది మంజూరు చేయలేదు. ఇన్నేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో ఎలాగైనా పథకం ద్వారా లబ్ధి పొందాలని కొందరు రాజకీయ ఒత్తిళ్లకు దిగుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం కింద కార్లు, గూడ్స్ ట్రక్కులు, ఆటోలకు సబ్సిడీ రుణం వస్తుంది. రూ.పది లక్షల యూనిట్ విభాగంలో ఇచ్చే కార్లు, ట్రక్కులు, ఆటోలకు ప్రభుత్వం నుంచి నలభై శాతం సబ్సిడీ వస్తుండడం, మరో 55 శాతం బ్యాంక్ నుంచి రుణం మంజూరు



కానుండడంతో తమకే రుణం వచ్చేలా చూడాలంటూ వివిధ పార్టీల నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఖర్చు అయినా పర్వాలేదని పథకానికి ఎంపిక చేయాలంటూ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. అటు ఇదే అదనుగా కొందరు చోటా నేతలు దరఖాస్తుదారుల నుంచి ముందే కమీషన్లు పుచ్చుకుంటూ రుణ మంజూరుకు హామీలు ఇచ్చేస్తున్నారు. రూ.నాలుగు లక్షలు సబ్సిడీకి రూ.లక్ష ఇవ్వాలంటూ బేరాలు సాగిస్తున్నారు.

దరఖాస్తుల వెల్లువ.. జిల్లాకు 1,111 యూనిట్లు

జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు 1,111 యూనిట్లు మంజూరు చేసింది. ఇందుకు రూ.20 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.పది లక్షల వరకు రుణాలను పొందేందుకు అవకాశం ఉంది. ఏలూరు జిల్లాకు 1111 యూనిట్లను మంజూరు చేయగా 6,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో యూనిట్‌కు 25 మంది పోటీ పడుతున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 14 నుంచి మే పదో తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించాలి. అయితే కొన్ని కారణాల వల్ల ఏడో తేదీ నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిలిచిపోయింది. మరో రెండు, మూడు రోజుల్లో మళ్లీ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 32 కేటగిరీలకు సంబంధించి వస్తు తయారీ, సేవల యూనిట్లకు రుణాలు అందిస్తున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉంటుందన్నారు.

ఉన్నారా? ఉడాయించారా?

- ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసిబ్బంది అందుబాటుపై 'రెవెన్యూ' ఆకస్మిక తనిఖీలు
- వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ నిశిత పరిశీలన
- పలు పీహెచ్‌సీల్లో ఇప్పటికీ డాక్టర్ ఒక్కరే!

ఏలూరు అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసు పత్రుల్లో వైద్యసేవల లోపం, వైద్యాధికారుల హాజరు, తదితర అంశాలపై క్షేత్రస్థాయి ఆకస్మిక తనిఖీలకు కలెక్టర్ వెట్రి సెల్వి నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల పోలవరం, కైకలూరు, చాటపర్రువంటిచోట్ల పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో రోగులకు సకాలంలో వైద్యసేవలందించడంలో తలెత్తిన అవాంఛనీయ పరిణామాలు, నష్టంపై దృష్టి సారించిన కలెక్టర్ పూర్తిస్థాయి పర్యవేక్షణ చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో స్థానికంగా రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలకు పురమాయించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోతే కాస్తా కఠినచర్యలనే తీసుకుంటామని సంకేతాలు పంపారు. వైద్యసేవల్లో లోపాలను సహించబోమని హెచ్చరించారు. శనివారం రాత్రి జిల్లావ్యాప్తంగా పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలకు వెళ్లి, అక్కడ విధుల్లో వున్న మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది గురించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ ఆక స్మిక తనిఖీలు ఉదయం, రాత్రి 10 గంటల తర్వాత ఇకమీదట కూడా కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆ పీహెచ్‌సీల్లో ఒక్కరే డాక్టర్

జిల్లావ్యాప్తంగా 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో ఇద్దరు వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఎఫ్ఎన్‌వో/ఎంఎన్‌వో, నైట్ వాచ్‌మెన్, సీనియర్ అసిస్టెంట్, తదితర వైద్యసిబ్బంది ఉంటారు. ప్రతీ పీహెచ్‌సీ 24 గంటలూ పనిచేసేలా నిర్దేశించారు. ఆదివారాలు, పండుగరోజుల్లో సైతం పీహెచ్‌సీలు తెరిచిఉంచాల్సిందే. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిగంటలు నిర్ణయించి, వీరిలో ఒకరు గ్రామాల్లో సచి వాలయాలకు వెళ్లి 104 వైద్యసేవల కింద రోగులను పరీక్షించి వైద్యసేవలందించాల్సి ఉంటుంది. మరొక మెడికల్ ఆఫీసర్ పీహెచ్‌సీలో విధుల్లో ఉండాలి. ఇలా ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఒకరు పీహెచ్‌సీలో ఉంటే, మరొకరు 104 వైద్యసేవల్లో ఉండేలా జాబ్‌చార్టు రూపొందించారు. డెలివరీ, అత్యవసర కేసులు వస్తే ఆన్‌కాల్ డ్యూటీకి అర్ధరాత్రి



జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో శనివారం రాత్రి వైద్యసిబ్బంది హాజరును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అయినా పీహెచ్‌సీకి మెడికల్ ఆఫీసర్ హాజరుకావాల్సిందే. రాత్రివేళల్లో పీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సు, కంటింజెంట్ వర్కర్, నైట్ వాచ్‌మెన్ అందు బాటులో ఉండితీరాలి. జాబ్‌చార్టు ఇంతస్పష్టంగా ఉన్నప్పటికీ జిల్లాలో సుమారు 10 పీహెచ్‌సీలకు సాయంత్రం 4 గంటలకే తాళాలువేసి మెడికల్ ఆఫీసర్‌తో సహా, మిగతా సిబ్బంది వెళ్లిపోతున్నట్టు సమాచారం. ఇటువంటి అనైతిక పనులన్నీ తాజాగా చేపడుతున్న ఆకస్మిక తనిఖీలతో అడ్డుకట్ట వేయ వచ్చని భావిస్తున్నారు. కలెక్టర్ తీసుకున్న సంచలనాత్మక నిర్ణయంతో గ్రామాల్లో పీహెచ్‌సీలు వైద్యసేవలకు అందు బాటులో ఉంటాయని చెప్పవచ్చు. కానీ జిల్లాలో కొల్లేటికోట, మండవల్లి, కలిదిండి, మూలలంక, పూళ్ల, ద్వారకాతిరుమల, కామవరపుకోట, తడికలపూడి, లింగపాలెం, కోండ్రుకోట, కొయిడా, అమరవరం పీహెచ్‌సీల్లో ఒక్కొక్క మెడికల్ ఆఫీసర్ మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. వీటిలో పనిచేసిన వైద్యాధి కారుల్లో పలువురికి పీజీ వైద్యవిద్య సీట్లు రావడంతో వెళ్లిపోయారు. మరోవైపు పీహెచ్‌సీల్లో పనిచేయాల్సిన మెడికల్ ఆఫీసర్లలో పలువురు నిబంధనలకు విరుద్ధంగా ఏలూరులోని అర్బన్ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. కలెక్టర్ వెట్రిసెల్వి కీలకమైన ఈ సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తే క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో రోగులకు నాణ్యమైన వైద్యం లభిస్తుందని చెప్పవచ్చు.

■ లోపలి పేజీలో..



సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద తనిఖీలు

జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతం

ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని ఐదు కేంద్రాల్లో ఆదివారం జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష నిర్వహణను టీసీఎస్ పర్యవేక్షించింది. ఏలూరు సమీపంలోని వట్లూరులోని ఓ పరీక్ష కేంద్రం వద్ద వసతుల లేమిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.



ఇద్దరు చిన్నారులను.. మింగేసిన జల్లేరు జలాశయం

బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఆదివారం ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. తాడేపల్లిగూడెం నుంచి సెలవులకు జంగారెడ్డిగూడెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. జలాశయానికి చూడడానికి వెళ్లి ఆశువులు బాసారు.

ఆడుతూ..పాడుతూ!

- చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు
- 'సక్షం' పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట పరికరాలు
- తొలి విడత 855 చోట్ల ఏర్పాటు
- రానున్న సీజన్‌లో మరో 445 కేంద్రాల్లో ఏర్పాటుకు కార్యాచరణ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కేంద్రాల పటిష్ఠతపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారులను ఆకట్టుకునేందుకు ఆట పరికరాలు స్వాగతం పలుకుతున్నాయి. ఆట పాటలతో వారిని చదువులపై దృష్టి మరల్చేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడిగా మారుతున్నాయి. 'సక్షం' పథకం కింద జిల్లాలోని 855 సొంత అంగన్‌వాడీ భవనాలున్న కేంద్రాలకు యూనిట్ వ్యయం రూ.19,800 తో ఇప్పటికే ఆట పరికరాలను అమర్చారు. తాజాగా ఈ సీజన్‌కు 445 కేంద్రాల్లో అదే వ్యయంతో ఆట పరికరా లను ఏర్పాటు దిశగా జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ అడుగు లు వేస్తోంది. జిల్లాలో పది సీడీపీవో ప్రాజెక్టుల కార్యాలయాల పరిధిలో 2,225 కేంద్రాల్లో మొత్తం 1,24,078 మంది అంగన్‌వాడీ సేవలను పొందుతున్నారు.



వివిధ రంగులతో ఎలిఫెంట్ టస్కర్



ఆకర్షణీయంగా కుర్చీలు

ఆకట్టుకుంటున్న ఆట పరికరాలు

ఎలిఫెంట్ టస్కర్ రైడర్, బేబి చైర్లు, డోర్‌మాట్, కార్టూన్ బొమ్మలు, ప్లేమ్యాట్, సైన్సు, వినోదం, అంకెలు కలబోతతో వివిధ రకాల ఆట పరికరాలు అబ్బురపరుస్తున్నాయి. ప్రైవేట్ ప్లే స్కూల్స్‌ను తలపించేలా ఏర్పాట్లు ఉన్నాయి. రానున్న విద్యాసంవత్సరంలో ఈ ఆట పరికరాలను అమర్చేందుకు త్వరలో జిల్లా అధికారులు టెండర్లు పిలిచి కొనుగోలు చేయనున్నట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె కష్టాలు!

లింగపాలెం : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. జిల్లాలో పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతుండగా సుమారు వెయ్యి వరకు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రూ.2వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6వేలు అద్దె చెల్లిస్తోంది. ఈ అద్దెకు గ్రామీణ ప్రాంతాల్లో విశాలంగా ఉన్న అద్దె గదులు దొరకకపోవడంతో ఒకే గదిలో అరకొర సౌకర్యా లతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే రూ.2వేలు అద్దె ప్రతినెలా చెల్లించకుండా ఆరునెలలకు ఒకసారి ఇస్తుండడంతో ప్రతినెలా తమ జీతాల నుంచే చెల్లించాల్సి వస్తోందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, లేదంటే కనీసం అద్దె గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు ఇవ్వాలని కోరుతున్నారు.



చాట్రాయిలో..



దెందులూరులో..

జయహో..

పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడాన్ని పురస్కరించుకుని సైనిక దళాలకు సంఘీభావంగా జిల్లాలో ఆదివారం తిరంగా యాత్రలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహిస్తూ సైనికులకు జైజైలు పలికారు. చాట్రాయిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారథి, కూటమి నాయ కులు పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో మహిళలు, పౌరులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. దెందులూరులో జరిగిన యాత్రలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

- ఈదురు గాలులతో పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయాలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఏలూరు సిటీ/పెదపాడు/చింతలపూడి మే 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనంతో మధ్య కోస్తాంధ్రలో ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తగ్గట్టుగానే జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం పగటి పూట ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించినా సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పలు ప్రాంతాల్లో కురిశాయి. భారీ ఈదురుగాలుల కారణంగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోవడం, చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పోలవరంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెదపాడు, చింతలపూడి మండలంల్లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు వీచి వర్షం కురిసింది. గాలులు కారణంగా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇంకా కొనుగోలు కేంద్రాలకు చేరని వరి పంట తడిసి ముద్దవుతోంది. దీని వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

నైరుతి ప్రభావం వల్లే వర్షాలు

నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయని , అందుకే వాతావరణంలో మార్పులు ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయని చెబుతున్నారు. అయితే వాతావరణం విభిన్నంగా మారుతోంది. పగటి పూట ఎండ తీవ్రత విపరీతంగా ఉంటోంది. సాయంత్రం అయ్యేసరికి ఒక్క సారిగా మబ్బుల వాతావరణం ఏర్పడుతోంది. వెంటనే బలంగా ఈదురుగాలులు వీచి, పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. పలుచోట్ల అయితే గంట నుంచి రెండు గంటల పాటు భారీగా వర్షం కురుస్తున్నా పలుచోట్ల స్వల్పంగానే వర్షపాతం నమోదవుతోంది. ఈ రకమైన పరిస్థితులు గతంలో ఎప్పుడూ కనిపించలేదని చెబుతున్నారు.

కుక్కునూరులో పిడుగులు

కుక్కునూరు : కుక్కునూరులో ఆదివారం సాయంత్రం పడిన పిడుగులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రి, సినిమాహాల్ సెంటర్ వెనుకభాగంలోని మరో ప్రాంతంలో మూడు పిడుగులుపడ్డాయి. ఆ పిడుగుల శబ్దానికి ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. అరగంటసేపు ఉరుములు, మెరుపులతో పెద్దపెద్ద శబ్దాలు రావడంతో ప్రజలంతా భయపడిపోయారు. ఈ క్రమంలో తాటిచెట్ల మీద పిడుగులు పడడంతో మంటలు రేగాయి. కుక్కునూరు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడింది.



కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలో పిడుగు పడి దగ్ధమవుతున్న తాటిచెట్టు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

ఏలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడు రోజుల పాటు కోస్తా జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. పిడుగులతో పాటు కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరికల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, టోల్‌ఫ్రీ నంబర్ 1800 233 1077 ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల ప్రధాన కేంద్రంలో, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు.

నేడు పీజీఆర్ఎస్ వికేంద్రీకరణ అమలు

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా సోమవారం ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) వికేంద్రీకరణ మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో అమలు చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో అందించాలని ఆమె సూచించారు.

కొల్లేరు.. కట్టుబాట్ల వివాదం

సర్పంచ్‌పై దాడి.. పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

కైకలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామా ల్లో కట్టుబాట్లు మధ్య పెద్దలు నిర్వహించే పంచాయతీల్లో వివాదం చోటు చేసుకుని గ్రామ సర్పంచ్‌తో పాటు మరో మహిళపై దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొంతకాలం క్రితం కైకలూరు మండలం చటాకాయ్ గ్రామంలో క్షుద్రపూజలు చేస్తున్నారని కొంతమందిపై గ్రామపెద్దలు, ప్రజలు దాడి చేశారు. అప్పటి నుంచి గ్రామంలో విభేదాలు ఏర్పడటంతో గ్రామసర్పంచ్‌గా ఉన్న ఘంటశాల శేషారావు గ్రామ కట్టుబాట్లు మధ్య జరిగే కార్యక్రమాలకు కానీ ఇతర వాటికి హాజరుకావడం లేదు. కొల్లేరులో సొసైటీ భూముల్లో చేపల సాగు చేసి వచ్చిన ఆదాయాన్ని గ్రామస్థులంతా పంచుకుంటారు. అయితే క్షుద్రపూజలకు పాల్పడిన కుటుంబాలకు ఈ చెరువుల్లో వాటాలు ఇవ్వకపోవడంతో వారు అటవీ శాఖ ఉన్న తాధికారులకు అక్రమసాగు జరుగుతున్నట్లు ఫిర్యాదు చేసి చెరువులను ధ్వంసం చేయాలని కోరుతున్నారు. కొద్దిరోజులుగా ఈ వాటాల వివాదం నెలకొనడంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఆదివారం గ్రామపెద్దలు కట్టుబాట్లు మధ్య గ్రామం లో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమా వేశంలో ఇరువర్గాల మధ్య తీవ్రంగా వాగ్వాదం చోటుచేసుకున్నది. కొంతమంది మహిళలు ఆకస్మికంగా సర్పంచ్ శేషారావుపై, అతని వర్గీయులపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన జయమంగళ రామసీత అడ్డుకుంది. ఈ తరుణంలో ఆమెపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన రామ సీత పురుగుమందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఆమెను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి ఆమె బంధువులు తరలించారు. ఈ వివాదం - మిగతా 4వ పేజీలో



దాడి అనంతరం చిరిగిన దుస్తులతో సర్పంచ్ శేషారావు

నేడు దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

టి.నరసాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): అప్పలరాజుగూడెంలో దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అగ్నిప్రతిష్ఠ, మండపారాధనలు, పుష్పాదివాసము, తదితర కృత్యములు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక పూజల అనంతరం విగ్రహప్రతిష్ఠ నిర్వహించి అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉంగుటూరులో జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

ఉంగుటూరు, మే 18(ఆంధ్రజ్యోతి) : జనసేన కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు బీమా కల్పించి కష్టాలలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలువ గలుగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో జరిగిన జనసేన సభ్యత్వాల నాలుగో విడత కిట్లను ఆయన పంపిణీ చేశారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.17 లక్షల ప్రమాద బీమా ద్వారా కార్యకర్తల కుటుంబాలకు అందజేశామని వివరించారు.

ఆర్వోబీల పనులు త్వరలో ప్రారంభిస్తాం

» ఉంగుటూరులో బ్రిడ్జిల నిర్మాణంపై ఎంపీ పుట్టా పరిశీలన


ఉంగుటూరులో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా, పక్కన ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని.

ఉంగుటూరు,మే 18(ఆంధ్రజ్యోతి) : ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రూ.450 కోట్లతో నాలుగు ఆర్వోబీలను కేంద్రం మంజూరు చేసిందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన ఉంగుటూరులో నిర్మించనున్న ఆర్వోబీల నిర్మాణంపై ఆరా తీశారు. నియోజకవర్గంలోని ఉంగుటూరు, భీమడోలు, కైకరం, చేబ్రోలులలో ఆరేడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సింధు, నాయకులు పాల్గొన్నారు.

కాలేజీకి ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయండి..

నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయించాలని ఎంపీకి విశ్రాంత న్యాయ కళాశాల అధ్యాపకుడు బొమ్మిడి అప్పారావు వినతి పత్రం అందజేశారు.

'గన్ని'కి ఎంపీ పుట్టా మహేశ్ శుభాకాంక్షలు

భీమడోలు, మే 18(ఆంధ్రజ్యోతి):ఆప్కాబ్ ఛైర్మన్ పదవితో గన్ని వీరాంజనేయులుకు సముచిత స్థానం లభించిందని ఎంపీ పుట్టా మహేష్ అన్నారు. భీమడోలులోని గన్ని నివాసంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్నిని ఆదివారం ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పొత్తు ధర్మాన్ని పాటిస్తూ తన సీటును గన్ని త్యాగం చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనతో పాటు పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు గన్ని కీలకపాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సత్కరించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు


గెలుపొందిన విజేతలతో లయన్స్ క్లబ్ సభ్యులు

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : చెస్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం స్థానిక రామచంద్ర రావుపేటలోని ఎస్ఎస్ఆర్‌కే కాంప్లెక్స్‌లో ఏలూరు జిల్లాస్థాయి అండర్-15 విభాగంలో ఏలూరు, హేలాపురి ఎలైట్ లయన్స్ క్లబ్ సహకారంతో చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీలను క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. సీహెచ్ వివేక్, జి.అనురూప్ మోషే ప్రథమ స్థానం, జి.అభిషేక్ అబ్రహం ద్వితీయ, ఎన్‌టీటీ చితాగ్ని తృతీయ స్థానం, ఎ.రిత్విక్ నాలుగో స్థానం, ఎస్. మనీష్ ఐదో స్థానం సాధించారు. అండర్-7, 9, 11 బాలుర విభాగాల్లో బి. క్రిషన్, ఎస్‌కే హనోక్, జై.నిఖిల్.. బాలికల విభాగంలో వై.మృద్విక, ఎస్.వర్షిక, ఎన్.నిత్యశ్రీ.. అండర్-13 విభాగంలో ఎస్.నందితా చౌదరి గెలుపొందారు. విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి ఎన్.కృష్ణ, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.యోహానంద్, ఆర్బిటర్ ఆదిత్య పర్యవేక్షించారు.

'నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

ఏలూరుకార్పొరేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నిమ్మకాయలకు గిట్టుబాటు ధర కల్పించి నిమ్మ రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పవరుపేటలోని అన్నేభవనంలో నిమ్మ రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. నిమ్మకాయల ధర పడిపోవడంతో నిమ్మ రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే నిమ్మకాయలకు అత్యధిక ధర వచ్చే సమయంలో ధర తగ్గిపోవడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిమ్మ ఎగుమతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కిలో నిమ్మకాయలకు వంద రూపాయల ధర రావాల్సిన సమయంలో రూ.30 మాత్రమే వస్తుందన్నారు. రైతు సంఘ నాయకులు కట్టా భాస్కరరావు, జి.సురేష్ ఉన్నారు.


వేడుకలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు

నిశ్చితార్థ వేడుకలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

శంకర్‌పల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం నియో కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్, జగదీశ్వరిల ఏకైక కుమారుడు పవన్‌రాజ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చిరంజీవి, శ్రీదేవిల ఏకైక కుమార్తె సాయిశ్రుతి నిశ్చితార్థ కార్యక్రమం జరిగింది. దీనికి రాత్రి 8:30 గంటల సమయంలో తెలంగాణ సీఎం తోపాటు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ హాజరయ్యారు. వారిద్దరికీ ఆశీస్సులు అందించారు. ఇంకా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.


రామసీతను బైక్‌పై ఆసుపత్రికి తీసుకు వెళుతున్న బంధువులు

కొల్లేరు.. కట్టుబాట్ల వివాదం

(మూడో పేజీ తరువాయి)

జరుగుతుందని తెలుసుకున్న మీడియా ప్రతినిధులు వీడియోలు తీస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వీడియోలు తీస్తే సహించేది లేదంటూ గ్రామం నుంచి వెళ్లిపొమ్మని బలవంతంగా పంపించి వేశారు. ఈ సంఘటన తెలుసుకున్న కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

ఇరువర్గాల ఫిర్యాదులు

జయమంగళ రామసీత తనపై గ్రామానికి చెందిన బలే శేషారత్నం, మరో 13మంది దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బలే శేషారత్నం తనపై ఘంటసాల పార్థసారథి మరో 18మంది దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా మినీ మహానాడు

» లింగపాలెంకు తరలివచ్చిన టీడీపీ శ్రేణులు


మినీ మహానాడు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్


జంగారెడ్డిగూడెం నుంచి మినీమహానాడుకు వెళుతున్న కార్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న రావూరి కృష్ణ

లింగపాలెం, మే 18(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ మినీ మహానాడు కార్యక్రమం వేలాదిమంది తెలుగుదేశం కార్యకర్తల మధ్య అట్టహాసంగా ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పట్టాయగూడెంలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నారన్నారు. అనంతరం గన్ని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ మనమంతా అభివృద్ధికి ఓటువేసి గెలిపించుకున్నామని దేశంలోనే ఏపీ ముందువరుసలో ఉంటుందన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాసరి శ్యామ్‌చంద్రశేషు, గంటా మురళీ రామకృష్ణ, గరిమళ్ల చలపతిరావు, మొరంపూడి మల్లికార్జునరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, జగ్గవరపు ముత్తారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గంలోని లింగపాలెంలో ఆదివారం జరిగిన తెలుగుదేశం మినీ మహానాడు కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5 బస్సులు, 40 కార్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లామని టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి కృష్ణ, తూటిగుంట రాము తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లినట్లు పార్టీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ తెలిపారు. టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామ కుమార్, మహంకాళి రామ్మోహనరావు, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ యాకూబ్, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, కంచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొయ్యలగూడెం, గణపవరంలో 'మినీ మహానాడు'

బుట్టాయగూడెం/నిడమర్రు : కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం మార్కెట్ యార్డు వద్ద సోమవారం టీడీపీ మినీ మహానాడును నిర్వహిస్తున్నట్టు ఏపీ ట్రైకార్ ఛైర్మన్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరవుతారన్నారు. గణపవరం మండలం గణపవరంలోని కేవీపీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం మినీ మహానాడు జరుగుతుందని నిడమర్రు మండల టీడీపీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, కార్యదర్శి పొట్నూరి సింహాచలం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హాజరవుతున్నారన్నారు.


స్వామివారిని దర్శించుకున్న సినీ హీరోలు రోహిత్, మనోజ్

అభయాంజనేయుడికి నారా రోహిత్, మంచు మనోజ్ పూజలు

పెదపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : అప్పనవీడు అభయాంజనేయ స్వామి 24వ హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం స్వామికి సుప్రభాత సేవ అనంతరం 1,008 మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు, నక్షత్ర హారతి నిర్వహించారు. స్వామివారిని సినీ హీరోలు నారా రోహిత్, మంచు మనోజ్ దర్శించుకున్నారు. ఈనెల 30న విడుదలవుతున్న 'భైరవం' సినిమా ఘన విజయం సాధించాలంటూ పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు రఘు మ్యూజికల్, మిమిక్రి, రింగ్ డ్యాన్స్, విజయదుర్గా నాట్యమండలి సత్యహరిశ్చంద్ర నాటిక ప్రదర్శించారు. వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, ఈవో తారకేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందిస్తున్న రాజనాల, ఆలపాటి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం

పెదవేగి, మే 18(ఆంధ్రజ్యోతి): పేద వర్గాల ఆశాజ్యోతి కాంగ్రెస్‌పార్టీ అని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అన్నారు. ముండూరులోని దెందులూరు నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయినుంచి బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టాం చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా సూచనలతో పార్టీ మండల అధ్యక్షుల నియామకమని తెలిపారు. పెదవేగి మండల అధ్యక్షుడిగా చిలకలపూడి తాతకృష్ణ, దెందులూరు అధ్యక్షుడిగా నేతల సుబ్బారావు, పెదపాడు అధ్యక్షుడిగా రంభ కిషోర్, ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడిగా అరిగిల యోహానును నియమించారు.

ఎంపీని కలిసిన టీడీపీ మండల కమిటీ సభ్యులు

నిడమర్రు, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి టీడీపీ నాయకులు కృషి చేయాలని, తద్వారా ప్రజల మనస్సులు గెలవాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం భీమడోలులో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ దృష్టికి నాయకులు మండల సమస్యలను వివరించగా తన వంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల స్వామి, కార్యదర్శి పొట్నూరి సింహాచలం, సత్తినీడి నాని, ఎం.డి. గఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కామవరపుకోట, మే 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు ఆదివారం తెలిపారు.


జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరులో తిరంగా యాత్ర

150 అడుగుల పొడవు జెండాతో ప్రదర్శన

దెందులూరు,మే18 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించే విధంగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన త్రివిధ దళాలకు మద్దతుగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం దెందులూరులో తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. దెందులూరు గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిషోర్‌తో పాటు పార్టీ నాయకులు, అధికారులతో కలిసి 150 అడుగుల పొడవు గల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన మన దేశ జవాన్ ఆర్మీ అధికారుల తెగువ, ధైర్యం నేటి యువతకు ఆదర్శమన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గారపాటి రామసీత, మోతుకూరి నానిబాబు, గారపాటి కొండయ్యచౌదరి, బోడేటి మోహన్‌బాబు, యిప్పిలి వెంకటేశ్వరావు, ఏపీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.మహేష్‌యాదవ్, సర్పంచ్ తోట యేసమ్మ, మోటపర్తి రాజాబాబు, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో భక్తులు.. జంగారెడ్డిగూడెంలో పారిజాత గిరి ఆలయం

మార్మోగిన గోవింద నామస్మరణ

» వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి 15 వేల మంది భక్తుల రాక

ద్వారకాతిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న క్షేత్రంలో గోవింద నామస్మరణతో మార్మోగింది. సెలవురోజు ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. దర్శనం అనంతరం వకుళమాత అన్నప్రసాద భవనంలో ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది.

● స్వామి వారిని తూర్పుగోదావరి జిల్లా అడిషినల్ ఎస్పీ అల్లూరి వెంకటసుబ్బరాజు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ముఖమండపంలో పండితులు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. టీడీపీ నేత పుసులూరి శ్రీధర్ ఉన్నారు.

నేటి నుంచి పారిజాత గిరిలో బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం,మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ఈనెల 25 వరకు త్రిదండి చినజీయర్ స్వామి మంగళ శాసనములతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో మానికల రాంబాబు తెలిపారు. 20న ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, 21న హనుమంత వాహనసేవ, 22న ఉదయం పది గంటలకు కల్యాణోత్సవం, 23న గరుడోత్సవం, 24న చక్రస్నానం, రాత్రి ఎనిమిది గంటలకు గజవాహన సేవ, ధ్వజారోహణం, 25న రాత్రి శ్రీపుష్పయాగము నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు నల్లూరు రవి కుమార్ ఆచార్యులు తెలిపారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, మే 18 (ఆంధ్రజ్యోతి): రాట్నాల కుంట రాట్నాలమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.57,410, లడ్డూ ప్రసాదాల విక్రయాలతో రూ.31,950, ఫొటో విక్రయాలతో రూ.3855 ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో పర్యవేక్షించారు.

ఉపాధి వేతనదారులకు ఊరట

» పెరిగిన రోజువారీ కూలి రేటు

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం స్వల్ప ఊరటనిచ్చింది. వీరికి వేసవిలో ప్రత్యేక భత్యం ఇవ్వనందున ఆ లోటును భర్తీ చేసేందుకు దినసరి వేతనం పెంచింది. ఇప్పటివరకు రూ.300 ఇస్తుండగా ఇకపై రూ.307 చేసింది. ఈ పెంపును ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలోని 15 పంచాయతీల్లో 9,946 మందికి జాబ్‌కార్డులు ఉండగా ఉపాధి పనులు చేసేవారు 16,269 మంది ఉన్నారు. వీరిలో సగం మంది దూరప్రాంతాల్లో పనులకు వెళ్తున్నారు. అలాంటి వారంతా ఉపాధి వేతనం పెంపు వల్ల తిరిగి పనుల్లో చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.247 నుంచి రూ.300 వరకు వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కూలీలకు 15 శాతం నుంచి 30 శాతం వరకు వేసవి భత్యం అదనంగా ఇచ్చేవారు. దీనికోసం పనుల కోసం తీసుకువెళ్లే పరికరాల కోసం, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. ఇప్పుడు అలాంటి భత్యాలేవి లేకుండా స్వల్పంగా వేతనం పెంచారు.


ఉపాధి పనులు (ఫైల్)

కొలతల ప్రకారం వేతనం..

ఉపాధి పనులు గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇచ్చిన కొలతలు ప్రకారం వేతనం ఇవ్వడం జరుగుతుంది. వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురవకుండా రెండు పూటలా పనులు కల్పిస్తున్నాం.

హబీబ్ బాషా, ఏపీవో ఏలూరు రూరల్ మండలం

పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో అనర్థాలే : ఏపీ ఎస్టీఏ

ఏలూరు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఎస్టీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటరమణ, ప్రసాద్ ఆరోపించారు. పాత పద్ధతిలోనే మూడు రకాల బడులను కొనసాగించాలని, తక్షణమే తొమ్మిది రకాల బడులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లను ఎలిమెంటరీ పాఠశాలలకు కేటాయించడం, పలు మార్లు రేషనలైజేషన్‌కు గురైన టీచర్లకు బదిలీల్లో న్యాయం చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్నిరకాల బడుల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని ఒకే మాదిరిగా నిర్ణయించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమాల్లో ఏపీఎస్టీఏ భాగస్వామ్యం అవుతుందని వివరించారు.

నాగిరెడ్డిగూడెంలో సారాపై అవగాహన

చింతలపూడి, మే 18(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఎస్పీ ఆదేశాల మేరకు చింతలపూడి పోలీసులు నాటుసారాపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ సారా మహమ్మారి వల్ల జీవితాలు నాశనమవుతాయని, దాని తయారీకిగాని, అమ్మకాల జోలికిపోవద్దని హితవు పలికారు. ఈ గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేలా గ్రామస్థులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం దీని కోసం నవోదయ 2.0 కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, దీనివలన ఈ గ్రామ ప్రజలకు జీవనోపాధి, విద్యాబోధన అందుతాయని పేర్కొన్నారు. జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా ఉండేలా ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. సారా తయారీ, విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కుటుంబారావు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సరోజిని నాయుడు జీవిత చరిత్రపై అవగాహన

పెదపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి విజ్ఞాన ఉచిత శిబిరంలో భాగంగా పెదపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సరోజిని నాయుడు జీవిత చరిత్రపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సరోజిని నాయుడుకు మహాత్మాగాంధీ, నెహ్రూలతో గల పరిచయాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆమె పాత్రను వివరించారు. అనంతరం పాణ్యం రామశేషశాస్త్రి రచించిన 'అనగనగా యదార్థ గాథలు' అనే పుస్తకం నుంచి పిల్లల పెంపకంలో క్రమశిక్షణ అనే నీతికథను వివరించి, ఇండోర్ గేమ్స్‌లో భాగంగా లూడో, స్నేక్ గేమ్స్‌ను ఆడించారు. గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తాగునీరు పట్టుకుంటున్న ఉప్పరగూడెం వాసులు

క్రొవ్విడిలో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

నిడమర్రు మే 18 (ఆంధ్రజ్యోతి) : క్రొవ్విడి గ్రామ శివారు ఉప్పరగూడెం వాసుల త్రాగు నీటి కష్టాలను తీర్చడం కోసం జనసైనికులు ముందుకొచ్చారు. తాగునీటి ఇబ్బందుల గమనించిన వారు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా తాగునీటి ట్యాంకర్లను పంపించి స్థానిక దాహార్తిని తీర్చారు. కార్యక్రమంలో క్రొవ్విడి జనసేన నాయకులు వాకమూడి ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామవరంలో గడ్డివాము దగ్ధం

టి.నరసాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): ఏపిగుంట పంచాయతీలోని శ్రీరామవరంలో గడ్డివాము దగ్ధమైన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని కాల్నీడి సుబ్బారావుకు చెందిన గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. దీంతో పాటు బిందుసేద్యం పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్టు స్థానికులు తెలిపారు. చింతలపూడి అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినప్పటికి పూర్తిగా దగ్ధమైంది.

'జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కొనసాగించాలి'

కామవరపుకోట, మే 18(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలోని వేంకటేశ్వర జూనియర్ కళాశాలను కొనసాగించేలా ద్వారకాతిరుమల దేవస్థానం మేనేజ్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయన కనకరాజు కోరారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నాలుగు దశాబ్దాల పాటు ఎంతో మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యను అభ్యసించి దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతలు సొంతం చేసుకున్నారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో మేనేజ్‌మెంట్ రకరకాల సాకులు చూపించి అడ్మిషన్‌లు ఆపేసి కళాశాల మూసివేసే ఆలోచనలు చేయడం తగదన్నారు. కళాశాల మూసివేయకుండా కొనసాగించేలా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఏలూరులో 'భైరవం' సినిమా ట్రైలర్ లాంచ్

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్‌లు నటించిన 'భైరవం' చిత్రం ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా చిత్ర బృందం ఆదివారం సాయంత్రం ఏలూరు ఇండోర్ స్టేడియంలో ట్రైలర్‌ను లాంచ్ చేశారు. హీరోయిన్లు అతిథి శంకర్, ఆనంది పాల్గొని సందడి చేశారు.రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, నిర్మాత అంబికా కృష్ణ హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేశారు. రాష్ట్ర మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ట్రైలర్ అద్భుతంగా ఉందన్నారు. చలనచిత్ర పరిశ్రమకు వైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. హీరోలు మాట్లాడుతూ ముగ్గురం కలిసి నటించడం ఆనందంగా ఉందన్నారు. నటులు అజయ్, దర్శకుడు విజ య్ కనకమేడల, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్, నిర్మాత రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందుతున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

శ్రీవారి సేవలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

ద్వారకాతిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై పూర్తి స్వస్థత పొందిన అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆల యానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చ కులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బంగారు వాకిలి గుండా వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శిం చుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈవో నటరాజారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందించారు. టీడీపీ నాయకులు నేతలు ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి, గుణ్ణం రవికుమార్, ప్రవీణ్‌కుమార్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఫైరింగ్‌పై శిక్షణ

నరసాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో సెవెన్ ఆంధ్రా నేవెల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపు ఆదివారం ఐదో రోజుకు చేరింది. కేడెట్స్‌కు ఫైరింగ్, యోగా, డ్రిల్, రన్నింగ్ తదితర అంశాలపై గ్రూప్ లెఫ్టినెట్ కమాండర్ రోహిత్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఫైరింగ్‌కు ఏకగ్రత చాలా ముఖ్యమన్నారు.ఇది యోగా వల్లే సాధ్యపడు తుందన్నారు. వ్యాయమంతో పాటు విధిగా యోగా చేయాలన్నారు. దీనివల్ల చదువుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఆనంతరం అగ్ని మాపక సిబ్బంది ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్ని ఎలా అదుపు చేయాలన్న దానిపై శిక్షణ ఇచ్చారు. ఫైర్ అధికారి నాగరాజు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర మల్లకంబ్ జట్టులో స్థానం సాధించిన క్రీడాకారులతో కోచ్

మల్లకంబ్ రాష్ట్ర జట్టులో భీమవరం క్రీడాకారులు

భీమవరం అర్బన్, మే 18, (ఆంధ్రజ్యోతి) : 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మల్లకంబ్ జట్టులో భీమవరానికి చెందిన 9 మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్ రాజు తెలిపారు. భారత ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని బుద్దగయలో జరిగాయన్నారు. ఈ క్రీడల్లో మొత్తం 12 మంది క్రీడాకారుల రాష్ట్రజట్టు ఎంపికవగా దానిలో ఐగురు బాలికలు, నలుగురు బాలురు భీమవరానికి చెందిన వారు కావడం విశేషం అన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు ఎంతగానో అలరిస్తున్నాయి. ప్రేక్షకులను ఆలోచింప చేశాయి. ఆదివారం ప్రదర్శించిన గోవాడ క్రియేషన్స్ హైద్రాబాద్ వారిచే అమ్మ చెక్కిన బొమ్మ, కృష్ణా ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారిచే ద్వార బంధాల చంద్రయ్య నాయుడు నాటికలు ఆకట్టుకున్నాయి.నాటకోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నాటక రంగ కళాకారులకు కూడా నంది అవార్డులు అందిస్తామని చెప్పారు.

రక్తి కట్టించిన ద్వార బంధాల చంద్రయ్య

బ్రిటీష్ పాలకులకు పక్కలో బల్లెమైన మన్యం విప్లవ వీరుడు ద్వార బంధాల చంద్రయ్య ఉత్తేజకర, స్ఫూర్తిదాయక పోరాట గాధను కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గుడివాడ కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. పది పన్నెండు మంది బాలలు, సహా 30 మంది నటులతో రక్తి కట్టించారు.



అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సన్నివేశం

అమ్మ చెక్కిన బొమ్మ

ఓ ట్రాన్స్‌జెండర్ వాస్తవగాథ అమ్మ చెక్కిన బొమ్మ నాటిక ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గోవాడ క్రియేషన్స్, హైద్రాబాద్ కళాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. భావోద్వేగాలకు తోడు గాఢమైన సందేశాన్ని అందించింది. ఎన్నో అవమానాల్ని అధిగమించి, ఉన్నత చదువులు చదవి ప్రస్తుతం మంచిస్థాయిలో ఉన్న ట్రాన్స్‌జెండర్ వృత్తాంతమే ఈ నాటిక. అనంతరం సాహితీవేత్త ప్రొఫెసర్ వెల్చేర్ నారాయణరావుకి గిడుగు రామ్మూర్తి, సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

బెజవాడ దుర్గమ్మవు.. పోడూరు గరగలమ్మవు నీవే..



పోడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): పోడూరు గ్రామదేవత గరగలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన కూరగాయల వర్తకుడు మండ నాగరాజు కుమారులు బాల వెంకటకృష్ణ, చైతన్యలు 320 కేజీలు కూరగాయలు, 70 కేజీల కరివేపాకు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. 21న అమ్మవారికి జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

రూ.4900 కోట్లు

డీసీసీబీ రుణ లక్ష్యం ఖరారు
5.9 లక్షల మంది పైబడి రైతులకు రుణం
డిపాజిట్ల పెంపు లక్ష్యం రూ.100 కోట్ల పైబడే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి), మే 18 : రానున్న ఖరీఫ్, రబీల్లో రైతులకు మరింత చేరువగా రుణాలను అందించేందుకు సొసైటీలు సమాయత్తం అవుతున్నాయి. ఆరుగాలం పంటలు పండించే రైతులకు ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.4900 కోట్ల సత్వర పంట రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉమ్మడిగా 34 బ్యాంకు బ్రాంచిల కింద 258 సొసైటీల కింద రుణాలను ప్రతీ రెండు పంటల కాలాలకు రైతులకు డీసీసీబీ సమకూర్చేది. అయితే ఈ సంస్థను ఆర్థిక నష్టాలను వెంటాడుతున్నప్పటికీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఇటీవల పెంచిన పెట్టుబడి సాయం పరిమితికి లోబడి అతికష్టం మీద రూ.4900 కోట్ల రుణాలను ఇచ్చి తీరాలని ఇటీవల లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఏలూరు జిల్లాలో 2,50,465 మంది రైతులు పశ్చిమ గోదావరి జిల్లాలో 3,40,233 మంది రైతుల కలిపి మొత్తం 5 లక్షల 90 వేల 598 మంది పంట రుణాలను ఏటేటా పొందుతున్నట్లు సమాచారం. ప్రతీ సొసైటీలో గతంలో ఇచ్చిన రుణం కంటే ఈసారి 15 శాతం అదనంగా రుణాలను ఇచ్చి తీరాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సంస్థకు 1982 కోట్ల డిపాజిట్లు చేతిలో ఉన్నాయి. రానున్న ఆర్థిక సంవత్సరంలో దీన్ని 2280 కోట్ల డిపాజిట్లను పెంపు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అంటే దాదాపుగా ఏడాది కాలంలో 100 కోట్ల డిపాజిట్లను సేకరించడం ద్వారా రుణాల అందజేతకు ముందడగు వేయనుంది. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై 8.25 శాతం, ఇతర వర్గాలకు 7.75 శాతం వడ్డీని డీసీసీబీ చెల్లిస్తోంది.

మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి

రైతులు సొసైటీల వారీగా సత్వరం రుణాలను అందజేయాలంటే డీసీసీబీ మొండి బకాయిలు వసూళ్లు కీలకమే. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల కింద గడచిన మార్చి నాటికి 260 కోట్లు బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనే మార్చి 2026 అంతానికి రూ.50 కోట్లు అయినా వసూళ్ల పురోగతి సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు రైతులకొచ్చే సమయం అయినందున ఆశించిన మేర పురోగతి సాధిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతీ సొసైటీలో రైతులకు సత్వరం అడిగిన వారి రుణం అందివ్వడానికి సన్నద్ధంగా ఉన్నామని జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈవో సింహాచలం తెలిపారు. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న రైతులే ధ్యేయంగా తమ బ్యాంకు బ్రాంచిలు పనిచేస్తాయని వివరించారు.





వట్లూరు సీఆర్‌ఆర్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు ..కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్/ తాడేపల్లిగూడెం రూరల్/ భీమవరం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షకేంద్రానికి మొత్తం 180 మంది విద్యార్థులను కేటాయించగా ఉదయం షిఫ్టులో జరిగిన పేపర్-1 పరీక్షకు 175 మంది, మధ్యాహ్నం షిఫ్టులో జరిగిన పేపర్-2 పరీక్షకు 174 మంది హాజరయ్యారు. సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలుకి 144 మంది విద్యార్థులను కేటాయించగా రెండు షిఫ్టుల్లోను 140 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను టీసీఎస్ పర్యవేక్షించింది. తాడేపల్లిగూడెం పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పరీక్షల్లో 240 మందికి గాను 238 మంది పరీక్షలు రాయగా పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పూటల జరిగిన పరీక్షలకు 136 మందికి 135 మంది పరీక్షలు రాశారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులకు 120 మంది హాజరయ్యారు.

వట్లూరు పరీక్ష కేంద్రంలో వసతుల లేమిపై తల్లిదండ్రుల ఆందోళన

ఎన్‌బీఈ, ఎన్టీయే నిర్వహించే జాతీయస్థాయి పోటీ పరీక్షలు సాధారణంగా ప్రతిష్టాత్మక ఏజెన్సీల ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు సొంత కేంద్రాలు లేనిచోట జిల్లాల వారీగా అన్ని వసతులున్న విద్యాసంస్థల్లో పరీక్షల విభాగాలను లీజు ప్రాతిపదికన నిర్వాహకులు తీసుకుంటారు. ఇందుకు సంబంధిత విద్యాసంస్థకు నిర్ణీత మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్‌రూపంలో నిర్వాహకులు చెల్లిస్తుంటారు. ఆ మేరకు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఏసీ సౌకర్యం విద్యార్థులకు కల్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు. తాజాగా ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు వట్లూరులోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ముచ్చెమటలు తప్పలేదని తల్లితండ్రులు ఆరోపించారు. రాయలసీమ, శ్రీకాకుళం, తదితర సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడి కేంద్రానికి పరీక్ష నిమిత్తం తల్లితండ్రులతో సహా సామాగ్రిని వెంటబెట్టుకుని ఆదివారం ఉదయాన్నే వచ్చిన విద్యార్థులకు ముప్పుతిప్పలు ఎదురయ్యాయి. పరీక్షకు విద్యార్థులు వెళ్లిపోగా, సమీప ప్రాంతంలో నిలువనీడకూడా లేకపోవడంతో పరీక్ష కేంద్రం ప్రాంగణంలో చెట్లకింద వేచి ఉండటానికి ప్రయత్నించిన తల్లితండ్రులను నిర్వాహకులు వెళ్లగొట్టడంతో నిరసనకు దిగారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు వీలుగా ముందుగానే భోజనం బాక్సులను వెంట తెచ్చు కున్నప్పటికీ ప్రాంగణంలో తినడానికి వీలు లేదనడంతో వాగ్వాదం నెలకొంది. మహిళలనైతే కనీస అవసరాలను తీర్చుకునేందుకు కూడా అనుమతించకపోవడంతో పేరెంట్స్ కొద్దిసేపు ఆందోళనకు దిగారు. ఊరికి దూరంగా మారుమూల ప్రాంతంలో పరీక్షకేంద్రానికి అనుమతివ్వడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీనిపై విద్యాసంస్థ ప్రతినిధులు వివరణిస్తూ 'పరీక్ష నిర్వహణ, సౌకర్యాలు కల్పించడం లేదా పర్యవేక్షించడం నిర్వాహకుల బాధ్యత. ఇందులో విద్యాసంస్థకు ఎటువంటి సంబంధం లేదు.' అని తెలిపారు.

కోకో రైతులకు మద్దతు ధర ఏదీ ?

కిలో రూ.300 నుంచి రూ.430
ధర తగ్గించేస్తున్న కంపెనీలు
ఆందోళన బాటలో రైతులు



ఆరబోసిన కోకో పంట గింజలు

దెందులూరు మే 18 (ఆంధ్రజ్యోతి) : కోకో కంపెనీలు గత ఆరు నెలల నుంచి కోకో రైతులను, కౌలు రైతులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజలు కేజీ 950 వరకు ఉన్నప్పటికి కోకో కంపెనీలు మాత్రం రైతులకు క్షేత్రస్థాయిలో రూ.400 నుంచి రూ.450 వరకే మద్దతు ధర చెల్లిస్తున్నాయి. వారం రోజులుగా దెందులూరు నియోజకవర్గంలో రైతులు దెందులూరు మండలంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

జిల్లాలో కోకో పంటలను సుమారు 35 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా అందులో దెందులూరు నియోజకవర్గంలోనే 24 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 2022 సంవత్సరంలో కోకో కేజీ ధర రూ.300 నుంచి 350 రూపాయలు ఉండగా అప్పుడు ఎకరానికి రూ.40 వేలు కౌలుకు తీసుకునేవారు. కోకో పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, ఒక్కసారిగా కేజీ రూ.1040 చేసి కొనుగోలు చేయడంతో కౌలు రైతులు అప్పట్లో లాభాలు గడించారు. కౌలుకు తీసుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపించారు. పోటీ పెరగడంతో ఎకరం రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు కూడా వెళ్లింది. అయితే ప్రస్తుతం రూ.380 నుంచి 440 వరకు కొనుగోలు చేస్తుండటంతో నష్టాలను చూడాల్సివచ్చింది. ఎమ్మెల్యే చింతమనేని, మంత్రి పార్థసారధిలు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళ్లగా కనీస మద్దతు ధర రూ.500లకు తగ్గకుండా ఇవ్వాలని ఆదేశించారు. అయినా కంపెనీలు ధర పెంచగపోగా రూ.50 తగ్గించారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు.

మద్దతు ధర ఇవ్వకపోతే నష్టం



నాకు ఉన్న 6 ఎకరాల్లో కోకో పంట వేశాను. పురుగు మందులు, ఎరువులు, కూలీల రేట్లతో పాటు పెట్టుబడులు పెరిగిపోయాయి. కేజీ ధర కనీసం రూ.950 తగ్గకుండా కోకో కంపెనీలు అందించాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఎంత ఉంటే అంతయినా ఇవ్వాలి.

నరసింహరావు, రైతు,కొండలరావుపాలెం

రూ.900 తగ్గకుండా ఇవ్వాల్సిందే..



నాకు ఉన్న సొంత భూమితో పాటు కొంత కౌలు తీసుకుని కోకో సాగు చేపట్టాను. ప్రస్తుతం ధర రూ.400 ఉంది. కనీసం కౌలు కుడా రాదు. రూ.900 తగ్గకుండా ఇవ్వాల్సిందే. లేకపోతే రైతులు తీవ్రంగా నష్ట పోతారు.

కోనేరు సతీష్‌బాబు, రైతు,విజయరాయి

ధర ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన



కోకో పంటలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధర ఇత్వాలి లేక పోతే కోకో రైతులు,కౌలు రైతులు తీవ్రంగా అప్పులు పాలైపోతారు.కోకో కంపెనీలు కోకో రైతులను పట్టించుకోకుండా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతాం. కోకో రైతుల న్యాయమైన డిమాండ్‌లను కోకో కంపెనీలు తీర్చాలి. కనీసం 900 మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

- కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పదోన్నతి తరువాతే నిర్ణయం తీసుకోవాలి

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులకు పదోన్నతి కల్పించిన తరువాతే క్లస్టర్ విధానంపై సరైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో స్పెసిఫిక్ పర్పస్, టెక్నికల్ పర్పస్‌కి సంబంధించి క్లస్టర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక సచివాలయానికి ఒక వీఆర్వోని కేటాయిస్తూ, మరొక సచివాలయానికి సర్వే అసిస్టెంట్‌ను కేటాయించారన్నారు. ఇలా చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులను మిగులు సిబ్బందిగా చూపించారన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టిన రోజు నుంచి క్లస్టర్ల విధానంలో అసంబద్ధత కారణాలతో భవిష్యత్‌లో జరిగే పరిణామాలపై ముం దుగానే రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. వీఆర్వోలకు ప్రమోషన్ కల్పించిన తరువాత మాత్రమే క్లస్టర్ విధానంపై తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. తమతో స్పందించకుండా, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీవో నెం.4 విడుదల చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు క్లస్టర్ విధానంలో 50 శాతం వీఆర్వోలు తగ్గిపోతున్నారని, క్లస్టర్ విధానంలో పనిచేయాలంటే పని భారం బాగా పెరుగుతుందని, మిగిలిన వీఆర్వోలకు ఏ బాధ్యతలు చెబుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అందువలన జీవో నెం.4 ద్వారా తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



ఏలూరు క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి) : కట్టుకున్న భర్తతో పాటు అత్తింటివారి వేధింపులు భరించలేక ఒక యువతి తన పుట్టింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు కొత్తపేటకు చెందిన పుచ్చల వెంకటేశ్వరరావు న్యాయవాదిగా వృత్తిని కొనసాగిస్తున్నారు. ఆయన కుమార్తె పుచ్చల కృష్ణసంగీతను గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన విశాఖపట్టణంలోని శివాజీపాలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నక్కిన శశికిరణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కృష్ణ సంగీత (29) ఏలూరు ఎస్‌ఆర్‌పేట పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆమె భర్త ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు.సంగీత తన ఖర్చులకు ఉంచుకుని మిగిలిన జీతం భర్తకు పంపిస్తున్నది. మొత్తం జీతం ఇచ్చేయాలని ఏలూరు నుంచి విశాఖపట్టణం బదిలీ చేసుకుని రావాలని భర్త వేధించగా అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె అత్త నాగేశ్వరిదేవి వేధిస్తున్నారు. వారి వేధింపులు భరించలేక ఆమె మానసిక వేదనకు గురై ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లోనే ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అత్యవసర వైద్యులు ఆమెను పరీక్షించి ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని వ్యవసాయ కూలీ మృతి



గణపవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం సరిపల్లె గ్రామ శివారు సీపీఎఫ్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం రాత్రి మినీ ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టిన సంఘ టనలో గంటా సాల్మన్ (60) అక్కడికక్కడే మృతి చెందాడు. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన గంటా సాల్మన్ వ్యవసాయ కూలీగా పని చేస్తాడు. ఆదివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో గణపవరం నుంచి కలిగొట్ల మోటర్ సైకిల్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీ ఐసర్ వ్యాన్‌ను ఢీకొట్టగా సాల్మన్ అక్కడికక్కడే మృతి చెందాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉండి, మే 18 (ఆంధ్రజ్యోతి): పనికి వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో పురుగులమందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కుడిపూడి సత్యశేఖర్ (22) మోటర్ వైండింగ్ నేర్చుకుంటున్నాడు. రెండురోజుల నుంచి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దాంతో అతను ఈనెల 15న పురుగుల మందు తాగాడు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఏలూరు, తదుపరి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

ఆడుకుని వచ్చేస్తాం నాన్నా..

వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి
బుట్టాయగూడెం జల్లేరు జలాశయంలో పడి మృత్యువాత



చిన్నారుల మృతదేహాలను బయటకు తీసుకు వస్తున్న బంధువులు



సిద్దిక్, మజీద్ (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం/ తాడేపల్లిగూడెం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి): ఆడుకుని వచ్చేస్తాం..నాన్నా అని వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పిల్లల భవిష్యత్ కోసమే ఆశతో జీవిస్తున్న ఆ తల్లిదండ్రులకు పిల్లలిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నిన్నటివరకూ ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ చిన్నారులు వేసవి సెలవులకు వెళ్లి వస్తామని చెప్పి తిరిగి రానికి లోకాలకు వెళ్లిపోవడంతో వారి కన్నీళ్లను ఆపడం ఎవరితరమూ కాలేదు.. తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ అన్వర్, పర్విన్ దంపతులకు సిద్దిక్ (11) అబ్దుల్ (7) ఇద్దరు కుమారులు. తండ్రి అన్వర్ తాడేపల్లిగూడెంలో ఫుట్‌పాత్‌పై బట్టలు, ఫ్యాన్సీషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సెలవులు కావడంతో పిల్లలను తీసుకుని తల్లి పర్విన్ రెండు రోజుల క్రితం పుట్టిల్లు అయిన ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం వెళ్లారు. ఆదివారం పిల్లలు మారాం చేయడంతో బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం చూడటానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు పిల్లలు జలాశయంలో దిగి ఆడుకుంటూ కాస్తంత ముందుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాద వశాత్తు జలాశయం నీటిలో మునిగి చనిపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఈతగాళ్లను పిలిచి చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ దుర్గా మహేశ్వ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్ళిన చిన్నారులను చూసిన ప్రతిఒక్కరూ కంటితడి పెడుతున్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబం కన్నీరు పెడుతుండగా వారిని వారించడం ఎవరితరం కావడం లేదు. వేసవి సెలవులు ఆ.. కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి.



పొట్టన పెట్టుకున్న జలాశయం

క్రికెట్ బెట్టింగ్ కేసులో పురోగతి : పాలకొల్లు సీఐ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ రజనీ కుమార్, ఎస్ఐ ప్రసాద్

పాలకొల్లుఅర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రికెట్ బెట్టింగ్ కేసులో పురోగతి సాధించామని పాలకొల్లు సీఐ కోలా రజనీకుమార్ తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మినరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేదల పర్యవేక్షణలో గత నెల 20 వతేదీన క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్నామన్నారు దీనిలో ఎ-3 యడ్ల నాగేశ్వరరావు, ఎ-4 వైసీపీ నాయకుడు యడ్ల తాతాజీ (సోదరులు) బ్యాంక్ ఖాతాల్లో భారీగా నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించామని తెలిపారు. దీనిలో ఎ-3 బ్యాంక్ అకౌంట్‌లో రూ.23 కోట్లు లావాదేవీలు జరిగినట్టు గుర్తించామన్నారు. నిందితుల బంధువుల బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల సమాచారం కూడా సేకరిస్తున్నామన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్ళి మోసపోరాదన్నారు.డబ్బు పోగొట్టుకుని ఆత్మహత్యలు, హత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయన్నారు. జూదాలను నిర్మూలించడానికి ప్రజలు, ముఖ్యంగా యువత సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, మే 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు కలిదిండి మండలంలో ఉరుములతో కూడిన వర్షాలు, కురవటంతోపాటు పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ప్రకృతి విపత్తులతో నష్టం వాటిల్లితే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9640540440, 9676107273, 9533295139కు సంప్రదించాలన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ముదినేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం పెదకామనపూడి గ్రామంలో ఓ యువతిపట్ల అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు వేధించిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన యువతి ఈ నెల 12న పొలాల్లో గొర్రెలను మేపుకుంటుండగా చంగాట రాము అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆదివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.


పురుగుమందు తాగిన రామసీతను బైక్‌పై ఆసుపత్రికి తీసుకు వెళుతున్న బంధువులు

కొల్లేరు.. కట్టుబాట్ల వివాదం

(మూడో పేజీ తరువాయి)

జరుగుతుందని తెలుసుకున్న మీడియా ప్రతినిధులు వీడియోలు తీస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వీడియోలు తీస్తే సహించేది లేదంటూ గ్రామం నుంచి వెళ్లిపొమ్మని బలవంతంగా పంపించి వేశారు. ఈ సంఘటన తెలుసుకున్న కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

ఇరువర్గాల ఫిర్యాదులు

జయమంగళ రామసీత తనపై గ్రామానికి చెందిన బలే శేషారత్నం, మరో 13మంది దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బలే శేషారత్నం తనపై ఘంటసాల పార్థసారథి మరో 18మంది దాడికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి వెండి మాల



కలిదిండి, మే 18 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వార్లకు గుడివాడకు చెందిన వన్నెంరెడ్డి మధుసూదనరావు, మాధవి, గీతా శ్రీ, దినేష్ వెండి పుష్పమాలను బహూకరించారు. ఆదివారం ఆలయంలో పూజలు జరిపిన అనంతరం దాతలు ఈ వెండి మాలను అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మకు అందజేశారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, దేవస్థానం మాజీ ఛైర్మన్ పసుపులేటి నరసింహారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మేలిమి చిట్టిబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు గ్రామ టీడీపీ కమిటీ ఏర్పాటు



ముదినేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు ముదినేపల్లి మండలంలో ప్రారంభమయింది. ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామ టీడీపీ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పడింది. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన గ్రామ పార్టీ కార్యకర్తల సమావేశంలో అల్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నీలిపల్లి సన్యాసిరావు, ఉపాధ్యక్షుడిగా నీలపాల మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శిగా ముంద్రు బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు బూత్ కన్వీనర్లు నియమితులయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నూజివీడు, మే 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు క్యాంప్ కార్యాలయంలో 124మంది లబ్ధిదారులకు రూ.83,47,413 విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల వైద్యం కోసం రాష్ట్రప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేస్తోందన్నారు. కార్యక్రమంలో నూజివీడు పట్టణ టీడీపీ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, టీడీపీ నాయకులు కందుల పిచ్చియ్య, వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: కైకలూరు ట్రావెలర్స్‌బంగ్లాలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలను అందించబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నేతలు పెన్మెత్స త్రినాధరాజు, బలే ఏసురాజు, చెరుకువాడ బలరామరాజు, పి రాధాకృష్ణ, వీరాబత్తిన సుధా, కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చనుబండలో 50 మంది రక్తదానం



చాట్రాయి, మే 18(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో ఇబ్బంది పడుతున్న పిల్లల కోసం మండలంలోని చనుబండలో ఎన్టీఆర్ ఫౌండేషన్(రా)ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించగా, 50 దాతలు రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎస్సై రామకృష్ణ, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు అభినందించి పండ్ల రసాలు అందజేశారు. కార్యక్రమంలో కోదండ రామాలయం ధర్మకర్త చెన్నకేశవరెడ్డి, స్థానిక నాయకులు ప్రదీప్‌కుమార్, సతీశ్, వీరాస్వామి, ఫౌండేషన్ ఇన్‌చార్జి మిద్దె అఖిల్, సభ్యులు పాల్గొన్నారు.


క్యాండిల్ మెమోరియల్ నిర్వహిస్తున్న స్నేహారైడ్స్ విద్యార్థులు

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలి

నూజివీడు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మనోధైర్యంగా ఉండటం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల జీవన ప్రమాణాలను మరింత పెంచవచ్చని స్నేహారైడ్స్ ఛైర్మన్ బసవరాజు నగేష్ అన్నారు. ఇంటర్నేషనల్ క్యాండిల్ మెమోరియల్‌ను పురస్కరించుకుని నూజివీడు రాజీవ్‌సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై చర్చిస్తూ ఆ వ్యాధిని నివారించే దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం వ్యాధిగ్రస్తులు పదిమందికి పౌష్టికాహారాన్ని అందించారు.

సైనిక సత్తాను ప్రపంచానికి చాటిన భారత్

చాట్రాయిలో తిరంగా ర్యాలీ.. పాల్గొన్న మంత్రి సారథి, నాయకులు

చాట్రాయి, మే 18(ఆంధ్రజ్యోతి): మన సైనిక దళాల శక్తి సామర్థ్యాలకు ఆపరేషన్ సిందూర్ మచ్చు తునక అని, ఇది మన సైనిక సత్తాని ప్రపంచానికి చాటి చెప్పిందని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. దేశం గర్వించే విధంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పిన సైనిక దళాలకు సంఘీభావంగా చాట్రాయిలో ఆదివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. వర్షం కారణంగా గంట ఆలస్యంగా మొదలైంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో మహిళలు, పౌరులు, అధికారులు, ఉద్యోగులు, కూటమి శ్రేణులు హాజరుకావటం విశేషం. మువ్వన్నెల జెండాలు చేతపట్టిన ప్రదర్శకులు భారత్‌మాతకు జై, మురళీ నాయక్ జోహార్ అంటూ నినదిస్తూ దేశభక్తితో పులకించిపోయారు. కొత్తపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పార్థసారథి, నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించి, పహల్గాం ఉగ్రదాడిలో అశువులు బాసిన భారత పౌరులకు, అమర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి కలగాలని మంత్రి ప్రార్థించారు. అనంతరం తిరంగా ర్యాలీ ప్రారంభమై మెయిన్ సెంటర్, పవర్ పేట, ఆర్సీఎం చర్చి మీదుగా దళితవాడ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం సాగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ ముగించారు.


తిరంగా ర్యాలీలో ప్రసంగిస్తున్న మంత్రి సారథి

మునుగుతున్న లోతట్టు వంతెనలు

వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బందులు

పట్టించుకోని పాలకులు, అధికారులు



సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు, వలసపల్లి ప్రధాన రహదారిలో సంధ్యవాగు ఉధృతితో మునిగిన లోతట్టు వంతెనలు (ఫైల్ ఫొటో)

ముసునూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారులపై ఉన్న లోతట్టు వంతెనలతో ప్రజలు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో ఈ వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పాత వంతెనలను విస్తరించకపోవడం, మరమ్మతులు చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వర్షాకాలంలో వాగులు దాటే పరిస్థితి లేదు. ఏటా కురుస్తున్న వర్షాలకు లోతట్టు వంతెనలు మునిగి పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో నిర్మించిన లోతట్టు వంతెనలు వినియోగంలో ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. వాటి స్థానంలో పెద్ద వంతెనలు నిర్మించి, తమ కష్టా లను తీర్చాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలి తం లేదని స్థానికులు వాపోతున్నారు. వరదలు వచ్చిన సమయంలో సుమారు 15 నుంచి 20 కిలోమీటర్లు చుట్టు తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాగుల పరిస్థితి ఇలా...

ముసునూరు నుంచి నూజివీడు వెళ్ళే ప్రధాన రహదారిలో సింహాద్రిపురం వద్ద రాములేరువాగు చాలా లోతుగా ఉంటుంది. వర్షాకాలంలో రాకపోకలు రోజుల తరబడి నిలిచిపోతాయి. పొలాలకు వెళ్ళే రైతులు, ప్రయాణికులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలసపల్లి వెళ్ళే రహదారిలో రెండు వాగులు తక్కువ ఎత్తులో ఉన్నాయి. సంధ్యవాగు చిన్నపాటి వర్షానికే రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే రమణక్కపేట రహదారిపై వెళ్ళే ఎర్రవాగు, అక్కిరెడ్డిగూడెం వైపు వెళ్ళే కట్టువాగుపై ఉన్న లోతట్టు వంతెనల వల్ల వర్షకాలంలో వరదనీరు ప్రవహించి, ఏటా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో తాడు సాయంతో స్థానికులు ద్విచక్ర వాహనాలను దాటిస్తుంటారు. ఈ క్రమంలో అదుపుతప్పి వాగుల్లో అనేకసార్లు కొట్టుపోయిన ఘటనలు సైతం ఉన్నాయి. పలు గ్రామాల నుంచి నూజివీడు వెళ్ళే విద్యార్థులకు వరదల సమయంలో అవస్థలు తప్పడం లేదు.

ఏటా ప్రయాణికులకు అవస్థలు

లోపూడి నుంచి యడవల్లి మీదుగా చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారిలో లోపూడి వద్ద ఉప్పావాగుపై ఉన్న లోతట్టు వంతెన వల్ల ఏటా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాల సమయంలో వాగు పొంగి రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఎన్ని రోజులకు వాగు ఉధృతి తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. అత్యవసర పరిస్థితుల్లో చింతలపూడి వైపు వెళ్ళాలంటే సోమవారం, కొత్తగూడెం మీదుగా, మరో మార్గం వలసపల్లి, దర్భాజీగూడెం నుంచి సుమారు 15 నుంచి 20 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి ఉంటుంది. అంత దూరం తిరిగి రాలేక ప్రమాదకరంగా ఉన్న వాగు దాటే క్రమంలో కొట్టుపోయిన ఘటనలు నెలకొన్నాయి. హై లెవిల్ నూతన వంతెన నిర్మాణానికి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర వంతెనలను గుర్తించాం

మండలంలోని పలు గ్రామాల నుంచి వెళ్ళే ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా ఉన్న లోతట్టు వంతెనలను గుర్తించాం. నూతన వంతెనల నిర్మాణానికి కావాల్సిన నిధులపై గతంలోనే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పెద్ద వంతెనల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

- అశోక్‌బాబు, ఆర్అండ్‌బీ ఏఈ

ఆడుకుని వచ్చేస్తాం నాన్నా..

వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి

బుట్టాయగూడెం జల్లేరు జలాశయంలో పడి మృత్యువాత


సిద్దిక్, మజీద్ (ఫైల్ ఫొటో)


చిన్నారుల మృతదేహాలను బయటకు తీసుకు వస్తున్న బంధువులు

బుట్టాయగూడెం/ తాడేపల్లిగూడెం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి): ఆడుకుని వచ్చేస్తాం..నాన్నా అని వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పిల్లల భవిష్యత్ కోసమే ఆశతో జీవిస్తున్న ఆ తల్లిదండ్రులకు పిల్లలిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నిన్నటివరకూ ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ చిన్నారులు వేసవి సెలవులకు వెళ్లి వస్తామని చెప్పి తిరిగి రానికి లోకాలకు వెళ్లిపోవడంతో వారి కన్నీళ్లను ఆపడం ఎవరితరమూ కాలేదు.. తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ అన్సర్, పర్వీన్ దంపతులకు సిద్దిక్ (11) అబ్దుల్ (7) ఇద్దరు కుమారులు. తండ్రి అన్సర్ తాడేపల్లిగూడెంలో ఫుట్‌పాత్‌పై బట్టలు, ఫ్యాన్సీషాపు నడుపు కుంటూ జీవనం సాగిస్తున్నాడు.


పొట్టన పెట్టుకున్న జలాశయం

సెలవులు కావడంతో పిల్లలను తీసుకుని తల్లి పర్వీన్ రెండు రోజుల క్రితం పుట్టిల్లు అయిన ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం వెళ్లారు. ఆదివారం పిల్లలు మారాం చేయ డంతో బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం చూడటానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు పిల్లలు జలాశయంలో దిగి ఆడుకుంటూ కాస్తంత ముందుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాద వశాత్తు జలాశయం నీటిలో మునిగి చనిపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఈతగాళ్లను పిలిచి చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ దుర్గా మహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్ళిన చిన్నారు లను చూసిన ప్రతిఒక్కరూ కంటితడి పెడు తున్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబం కన్నీరు పెడుతుండగా వారిని వారిం చడం ఎవరితరం కావడం లేదు. వేసవి సెలవులు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి.


ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెద్దింటమ్మకు భక్తుల తాకిడి

కైకలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. పలు జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో పాల పొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది.

పదోన్నతి తరువాతే క్లస్టర్ విధానంపై నిర్ణయం తీసుకోవాలి

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులకు పదోన్నతి కల్పించిన తరువాతే క్లస్టర్ విధానంపై సరైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో స్పెసిఫిక్ పర్పస్, టెక్నికల్ పర్పస్‌కి సంబంధించి క్లస్టర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక సచివాలయానికి ఒక వీఆర్వోని కేటాయిస్తూ, మరొక సచివాలయానికి సర్వే అసిస్టెంట్‌ను కేటాయించారన్నారు. ఇలా చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులను మిగులు సిబ్బందిగా చూపించారన్నారు. క్లస్టర్ల విధానంలో అసంబద్ధత కారణాలతో భవిష్యత్‌లో జరిగే పరిణామాలపై ముందుగానే రాష్ట్ర రెవెన్యూ మంత్రి, చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళామన్నారు.

రేపు కైకలూరులో మినీ మహానాడు

కైకలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ మినీమహానాడును ఈ నెల 20వ తేదీన కైకలూరులో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ మినీమహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ అబ్జర్వర్ మెంటే పార్థసారథి ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు తెలుగుదేశంపార్టీలోని అన్ని స్థాయి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 20వ తేది ఉదయం 11గంటలకు కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో మినీమహానాడు నిర్వహిస్తామన్నారు.

ఇద్దరిపై సారా కేసుల నమోదు

ముసునూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సారా రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. రమణక్కపేట సబ్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నూజివీడు మండలం మిట్టగూడెం గ్రామానికి చెందిన పోలగంటి చంటిని పట్టుకుని, 30లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్ సింగ్ తెలిపారు. నిందితుడిని విచారించగా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేటకు చెందిన భరోతుకుమార్ సారాను సప్లయి చేసున్నట్లు తెలిందని, వీరిద్దరుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


చెరువుల్లో మట్టి పొలాలకు తరలించొచ్చు

కన్నేసిన మట్టి మాఫియా

నూజివీడు, మే 18 (ఆంధ్రజ్యోతి):మట్టి మాఫియా దొరికిన ఏ అవకాశాన్ని వదులు కోవడం లేదు. అక్రమ మట్టితోలకాల పై తరచూ వార్తలు రావడం, అధికారుల దాడులు పెరగడంతో నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మట్టితోలకాలు కొంత అదుపులోకి వచ్చాయి. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లోని చెరువులు, జలాశయాలలోని మట్టిని తవ్వుకుని ఆయా గ్రామాల్లోని రైతులు తమ పొలాల భూములను సారవంతం చేసుకోవడానికి తీసుకెళ్ళడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చెరువులు పూడిక తీయాల్సిన చెరువులలో మాత్రమే అది ఒక మీటర్ లోతు మాత్రమే తవ్వి మట్టిని రైతులు తమ భూములకు తరలించుకోవచ్చు. క్యూబిక్ మీటర్‌కు ఒక రూపాయి మాత్రం ప్రభుత్వానికి చెల్లించాలి. జలవనరులశాఖకు మట్టి కావాల్సిన రైతులు దరఖాస్తు చేయాలి. అనుమతి పొందిన చెరువులు, జలాశయాలలోని మట్టి ఇతర ప్రాంతాలకు, అదీ వాణిజ్య పరమైన పనులకు తోలకూడదు. గ్రామాల్లోని రైతులు అతి తక్కువ ఖర్చుతో తమ భూములను కొత్త మట్టితో సారవంతం చేసుకునే అవకాశం వచ్చింది.

నూజివీడు ప్రాంతంలో కొన్నినెలలుగా రహస్యంగా చెరువులు, గుట్టలలోని మట్టి గ్రావెల్‌ను వాణిజ్య అవసరాలకు అమ్ముతున్న మట్టి మాఫియా రైతులకు వచ్చిన ఈ అనుమతి పై కన్నే సింది. ప్రస్తుతం నియోజకవ ర్గంలో అనేక చెరువులు ఎండి పోయి ఉన్నాయి. జూన్‌లో పడే తొలకరి వానలలోపే, ఈ అనుమ తిని అడ్డం పెట్టుకుని మట్టిని అక్రమంగా తరలించడానికి సన్నాహాలు ప్రారంభించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు

విజ్ఞానం సరే.. విత్తులేవీ!

గ్రంథాలయాలకు భారంగా మారిన వేసవి శిబిరాలు

విడుదల కాని బడ్జెట్ .. చిరుద్యోగులపై భారం

ముదినేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని శాఖా గ్రంథాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా ర్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు నిధుల కొరత ఏర్పడింది. వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంపొందిం చేందుకు ఉద్దేశించిన శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి కాని, రాష్ట్ర గ్రంథాలయ పరి షత్తు నుంచి గాని రెండేళ్లుగా నిధులు మంజూ రు చేయటం లేదు. జీతాలు కూడా సక్రమంగా అందుకోలేకపోతున్న చిరుద్యోగులైన లైబ్రేరియన్ల కు ఈ శిబిరాల నిర్వహణ భారంగా తయారైం ది. శిబిరాలకు గ్రంథాలయాల స్థాయిని బట్టి రోజుకి రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చు అవుతున్నది. గత నెల 28న ప్రారంభమైన జూన్ 6 వరకు ఈ శిబిరాలు జరుగుతాయి. ఒక్కో గ్రంథాల యంలో ఈ విజ్ఞాన శిబిరాల నిర్వహణకు 40 రోజులకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతుండగా, ఆ ఖర్చంతా లైబ్రేరియన్లే భరించాల్సి వస్తున్నది. వేసవి తీవ్రత పెరుగుతున్నందున తాగునీటి సౌకర్యాన్ని కల్పించటం కూడా భారంగానే తయారైంది. రోజూ విద్యార్థులకు తిను బండా రాలను అందించాల్సి వస్తున్నది. జిల్లా గ్రంథాలయ సంస్థ సెస్ నుంచి ఈ శిబిరాల నిర్వహణకు నిధులు మంజూరు చేసే అవకాశం కూడా లేకుండా పోయింది. 2024 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. ఈ ఏడాది శిబిరాలకు ఇంత వరకు బడ్జెట్ విడుదలకు జీవో రానేలేదు. విజ్ఞాన శిబిరాల నిర్వహణకు నిత్యం సొమ్ములు ఖర్చు చేయాల్సి ఉన్నందున ప్రభుత్వం విడుదల చేసే బడ్జెట్ కోసం లైబ్రేరియన్లు ఎదురు చూస్తున్నారు.

బడ్జెట్ రావాల్సి ఉంది

నగేష్, ఇన్‌చార్జ్ కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ

వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణకు ప్రభు త్వం నుంచి బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. బడ్జెట్ మంజూరు చేయగానే శాఖా గ్రంథాల యాలకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

22న హనుమాన్ జయంతి వేడుకలు



చాట్రాయి, మే 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని భారీ హనుమాన్ విగ్రహం మూడవ వార్షికోత్సం, హనుమజ్జయంతి ఉత్సవాలు 22వ తేదీన ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హనుమాన్‌కి ప్రత్యేక పూజలు అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందని అన్ని గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత


పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేస్తున్న డైరక్టర్

చాట్రాయి, మే 18(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద చీపురుగూడెం పాల సహకార సంఘం సభ్యుడు ఆలా పుల్లారావు కుమార్తె ఐశ్వర్య వివాహం సందర్భంగా రూ20 వేలు విలువైన బంగారు నాణాన్ని పెండ్లి కుమార్తెకు ఆదివారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరసింహారావు, వేతన కార్యదర్శి పాపోతు రాంబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముదినేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. హెచ్ఎం వై విజయకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఈదురు గాలులు.. భారీ వర్షం


ముసునూరు పోలీస్‌స్టేషన్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపునీరు

ముసునూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కారు మబ్బులు కమ్మి ఈదురుగాలులతో వర్షం కురిసింది. ప్రధాన, అంతర్గత రహదారులు సైతం జలమయం అయ్యాయి. గాలులకు గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. స్థానికులు రహదారులపై పడిన చెట్లను తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండే ఎండ, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234